# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 04-11-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

❖ పరిశోధనలు, ఆవిష్కరణల దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలని ఉన్నత విద్యా సంస్థలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు.

❖ బీహార్ లో అసెంబ్లీ ఎన్నికల మొదటి విడత ప్రచార గడువు ఈ రోజు సాయంత్రంతో ముగిసింది.

❖ ఎస్ఐఆర్ రెండవ దశను తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎన్నికల సంఘం ప్రారంభించింది.

❖ గాజా శాంతి ప్రణాళికకు భారతదేశం మద్దతు ఇస్తుందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పునరుద్ఘాటించారు.

===================

విద్య కేవలం స్వావలంబన సాధనం మాత్రమే కాదని దేశ అభివృద్ధికి ప్రేరణ అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఉత్తరాఖండ్ నైనీటాల్ లోని కుమావున్ విశ్వవిద్యాలయం 20వ స్నాతకోత్సవంలో పాల్గొని రాష్ట్రపతి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్య వల్ల మేధస్సు నైపుణ్యాలు నైతిక విలువలు పటిష్టమవుతాయని అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోందని యువతకు ప్రభుత్వం కొత్త అవకాశాలు కల్పిస్తోందని చెప్పారు. పరిశోధనలు, ఆవిష్కరణల దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలని ఉన్నత విద్యా సంస్థలకు రాష్ట్రపతి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

(వాయిస్ 35 సెకన్లు)

===================

బీహార్ లో అసెంబ్లీ ఎన్నికల మొదటి విడత ప్రచార గడువు ఈ రోజు సాయంత్రంతో ముగిసింది. మొదటి విడతలో భాగంగా 18 జిల్లాల్లోని 121 శాసనసభ నియోజకవర్గాల్లో ఈ నెల ఆరవ తేదీ గురువారం పోలింగ్ జరుగనుంది. తొలి

దశ ఎన్నికల ప్రచారం ముగియడంతో ఈరోజు వివిధ రాజకీయ పార్టీల కీలక నాయకులు విస్తృత ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మహాఘట్ బంధన్ కూటములకు చెందిన తేజశ్వీ యాదవ్, రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గే పలు చోట్ల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇక ఎన్డీయే కూటమి తరఫున భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్ కూడా ప్రచార సభల్లో పాల్గొనడంతోపాటూ రోడ్ షోలు నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకులు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు `మేరాబూత్ సబ్ సే మజ్‌బూత్` కార్యక్రమంలో భాగంగా బీహార్‌లోని మహిళలతో సంభాషించారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధిస్తుందని ఈ సందర్భంగా ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

గాజా శాంతి ప్రణాళికకు భారతదేశం మద్దతు ఇస్తుందని అది శాశ్వత పరిష్కారానికి మార్గం సుగమం చేస్తుందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియాన్ సార్ జైశంకర్‌తో ఈ రోజు న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. భారత్, ఇజ్రాయెల్ దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఉందని, దీనిని మరింత బలోపేతం చేసేందుకు ఉన్న అవకాశాలపై చర్చించామన్నారు. ఇరు దేశాలు ఉగ్రవాదం రూపంలో దీర్ఘకాలంగా ప్రత్యేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. అయితే ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నప్పటికీ దాని పట్ల పూర్తిగా జీరో టోలరెన్స్ విధానాన్ని అనుసరిస్తున్నాయని జైశంకర్ పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) రెండవ దశను భారత ఎన్నికల సంఘం ఈ రోజు ప్రారంభించింది. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో 50 కోట్ల మంది ఓటర్ల జాబితాలను ఈ కసరత్తులో భాగంగా సవరిస్తారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 7వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురణతో ఈ ప్రక్రియ ముగుస్తుంది. ఓటర్ల జాబితా సవరణ చేపడుతున్న తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, పశ్చిమ బెంగాల్లో 2026లో శాసనసభఎన్నికలు జరగనున్నాయి. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ డిసెంబర్ 4వ తేదీ వరకు కొనసాగుతుంది. డిసెంబర్ 9వ తేదీన తుది ముసాయిదాని ప్రచురించి జనవరి 8వ తేదీ వరకు అభ్యంతరాలను సూచనలను స్వీకరిస్తారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం 2030 నాటికి 300 మిలియన్ టన్నుల ఉక్కు సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుందని ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ చెప్పారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన CII స్టీల్ సమ్మిట్ 2025 ప్రారంభ సమావేశంలో ఆయన ప్రసంగించారు. జాతీయ ఆర్థిక వ్యవస్థకు ఉక్కు పరిశ్రమ వెన్నెముక అని వికసిత్ భారత్ దార్శనికతను సాకారం చేసుకోవడంలో ఇది కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సంవత్సరం మొదటి అర్ధభాగంలో ఈ రంగం 8.5 శాతం వృద్ధిని నమోదు చేసిందన్నారు. తక్కువ కర్బన ఉద్గారాలతో స్టీల్ ఎకో సిస్టమ్ ను నడిపించడానికి ప్రభుత్వం నేషనల్ మిషన్ ఆన్ సస్టైనబుల్ స్టీల్ కింద గ్రీన్, హైడ్రోజన్ ఆధారిత ఉక్కు సాంకేతికతలను ప్రోత్సహిస్తోందని ఆయన తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = =

మెలిస్సా తుఫానుతో తీవ్రంగా నష్టపోయిన జమైకా, క్యూబా దేశాలకు భారతదేశం 20 టన్నుల మేర మానవతా సహాయాన్ని ఇరు దేశాలకు పంపింది. ఈరోజు న్యూఢిల్లీ నుండి ఈ మానవతా సహాయాన్ని పంపించామని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ సామాజిక మాధ్యమంలో తెలిపారు. భారత వైమానిక దళ విమానం

పునరావాస సహాయ వస్తువులు, ఆహారం, రోజువారీ వినియోగాలు, మందులు, వైద్య పరికరాలు, విద్యుత్ జనరేటర్లతో సహా ఈ సహాయాన్ని తీసుకువెళ్లిందని అన్నారు. ఇటువంటి ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో భారతదేశం తన గ్లోబల్ సౌత్ దేశాల భాగస్వాములకు అండగా నిలుస్తుందని, ఆయా దేశాల పునర్నిర్మాణంలో సహాయం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

భారత నౌకాదళంలోకి  సగటున ప్రతి 40 రోజులకు ఒక కొత్త స్వదేశీ యుద్ధనౌకను లేదా జలాంతర్గామిని ప్రవేశపెడుతున్నామని నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠి వెల్లడించారు. 2035 నాటికి 200కుపైగా యుద్ధనౌకలు, జలాంతర్గాములు నౌకాదళం కలిగి ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రస్తుతం ఆర్డర్ చేసిన 52 నౌకలన్నీ స్వదేశీ నౌకాశ్రయాల్లోని నిర్మాణ దశలో ఉన్నాయని ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన వెల్లడించారు. గడచిన దశాబ్ద కాలంలో దేశీయంగా రక్షణ ఉత్పత్తుల విలువ మూడు రెట్లు పెరిగి గత ఏడాది 1.5 లక్షల కోట్ల రూపాయలు దాటిందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

గురునానక్ దేవ్ ఆదర్శాలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో అన్వయించుకొని సుసంపన్నమైన దేశాన్ని నిర్మించడానికి ఆయన చూపిన మార్గాన్ని అనుసరించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కోరారు. రేపు గురునానక్ జయంతి సందర్భంగా రాష్ట్రపతి దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. గురునానక్ దేవ్ ఆదర్శాలను, విలువలను స్వీకరించడానికి ఈ రోజు అందరినీ ప్రేరేపిస్తుందని రాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు. సత్యం, న్యాయం, కరుణ ఆధారంగా జీవించడమే విజయానికి నిజమైన కొలమానమని గురునానక్ జీ సందేశం బోధిస్తుందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 83,978 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమై.. చివరికి 519 పాయింట్లు నష్టపోయి 83,459 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 165 పాయింట్లు తగ్గి 25,597కి చేరింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 88 రూపాయల 66 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 63 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,994 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = =

అండమాన్, నికోబార్ దీవులలోని పలు ప్రాంతాల్లో రేపు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. అలాగే ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి కారైకల్‌లలో రేపు కూడా  ఇటువంటి పరిస్థితులే వుండే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = =

ఇంటర్ నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) తన మహిళల క్రికెట్ ప్రపంచ కప్ జట్టును ఈరోజు ప్రకటించింది. ఇందులో ముగ్గురు భారతీయ మహిళా క్రికెటర్లు స్మృతి మంధాన, జెమిమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ చోటు దక్కించుకున్నారు. ఈ టోర్నమెంట్‌లో స్మృతి మంధాన  434 పరుగులు, జెమిమా రోడ్రిగ్స్ 292 పరుగులు చేయగా, ఆల్ రౌండర్  దీప్తి శర్మ 215 కీలకమైన పరుగులతో పాటు 22 వికెట్లు తీసి భారత్ విశ్వవిజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించారు.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =